www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 24 డిసెంబర్ 2024

5

కాకినాడ



మలేరియా అధికారి నాగబాబుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - కాజులూరు

కాకినాడ యూనిట్ మలేరియా అధికారి నాగబాబును గొల్లపాలెం, దుగ్గుదూరు పిహెచ్‌సిల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ నెల 14, 15 తేదీలలో కృష్ణా జిల్లాలో జరిగిన 44వ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో భాగంగా పరుగు పందెంలో పాల్గొని నాగబాబు పసిడి పతకాలను సాధించారు. ఈ నేపథ్యంలో పురస్కరించుకుని సోమవారం డిఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగిన సత్కారంలో వైద్యాధికారులు సౌజన్య, పణితేజ, స్వాతి, శ్రేయ, వైద్య సిబ్బంది రాజారావు, వైకుంఠరావు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొని సత్కరించారు.

నాగబాబును సత్కరిస్తున్న వైద్య సిబ్బంది

ఆశలు నెరవేరేనా..?

- ఎస్‌టిఎస్ ప్రాజెక్టు కోసం ఎదురుచూపులు
- దరఖాస్తులు స్వీకరించి మరచిన గత సర్కార్
- కూటమి ప్రభుత్వంలో కదలిక వచ్చేనా..

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మధ్యతరగతి ప్రజలకు చౌక ధరల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ టౌన్ షిప్(ఎస్‌టిఎస్) ప్రాజెక్టును 2022లో ముందుకు తీసుకొచ్చింది. మధ్యతరగతి ప్రజల సొంతింటి కల నెరవేరుస్తామని పట్టణాలు, నగరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు అమ్మే స్థలాలు కంటే తక్కువ ధరకే ఇంటి స్థలాలను అందిస్తామని గొప్పగా చెప్పింది. దీంతో అనేకమంది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అయితే వివిధ కారణాలతో ఈ ప్రాజెక్టు మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో దరఖాస్తుదారులు తీవ్ర నిరాశ చెందారు. కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన నేపథ్యంలో చంద్రబాబు ఈ ప్రాజెక్టులో కదలిక తీసుకురావాలని మధ్యతరగతి వర్గాల ప్రజలు కోరుతున్నారు.

జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌ల పేరుతో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో చౌక ధరలకు ఇళ్ల స్థలాలను మధ్య తరగతికి ప్రభుత్వమే విక్రయించబోతోందని గత పాలకులు ప్రచారాన్ని ఊదరగొట్టారు. మధ్యతరగతి ప్రజలు ఇళ్ల స్థలం కొనుక్కోవాలంటే మార్కెట్ ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందని, రోజురోజుకూ పెరిగిపోతున్న ధరలతో ఇబ్బందులు నెలకొన్నాయని చెప్పుకొచ్చారు. ఇంటి స్థలం కొనుగోలు చేయాలంటే భారీ మొత్తాల్ని వెచ్చించాల్సిన పరిస్థితులున్న నేపథ్యంలో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ స్థలాల్లో మార్కెట్ ధర కంటే చౌక ధరలోనే ఇళ్ల స్థలాలను అందిస్తామని అప్పట్లో చెప్పారు. ఇళ్లు నిర్మించుకునేందుకు బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు తీసుకునేందుకుప సైతం వీలవుతుందని చెప్పుకొచ్చారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేకమంది దరఖాస్తులు చేశారు. కాకినాడ నగరంలో 15,401, పెద్దాపురంలో 2,587, సామర్లకోట 1,604, పిఠాపురం 1,010, తుని 616, ఏలేశ్వరం 619, గొల్లప్రోలు నుంచి 197 అప్లికేషన్లు అధికారులకు అందాయి.

గృహ యోగం ఎప్పటికో

ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు 2021లో గత వైసిపి ప్రభుత్వం ఎంఐజీ గృహాల లేఅవుట్లకు అప్లికేషన్లు ఆహ్వానించింది. 150, 200, 240 గజాల చొప్పున కేటగిరీల్లో 16, 12, 10 చొప్పున ప్లాట్లు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అప్పట్లో 46,238 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఇళ్ల నిర్మాణానికి 3,792 ఎకరాల భూమి అవసరమని అధికారులు అంచనా వేశారు. అయితే జగన్ ప్రభుత్వంలో పేదలకు పెద్దఎత్తున ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అందుకోసం పలుచోట్ల భూములను సేకరించారు. ఎకరాకు రూ.40 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. పలు గ్రామాల్లో, పట్టణాల్లో కొన్నిచోట్ల పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ ఇంకా వేలమంది స్థలాలు పొందలేకపోయారు. ఈ నేపథ్యంలో స్మార్ట్ టౌన్ షిప్ ప్రాజెక్ట్‌కి స్థలాలు కొనుగోలు చేయాలంటే సమస్యలు ఏర్పడ్డాయి. మరోవైపు పలుచోట్ల స్థలాలు కోర్టు కేసుల్లో పెండింగ్లో ఉన్నాయి. దీంతో ఈ ప్రాజెక్టు గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయింది. కాకినాడలో స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ఇక్కడి వారి కోసం పెద్దాపురం, జగ్గంపేట, ఏలేశ్వరం ప్రాంతాల్లో గుర్తించారు. తునిలో ధరలు ఎక్కువగా ఉండటం వలన స్థలాన్ని సేకరించలేకపోయారు. రాజానగరంలో ఎకరా రూ.కోటికి పైనే ధర పలకడంతో అధికారులు చేతులెత్తేసిన పరిస్థితి ఏర్పడింది. ఇలా అనేక చోట్ల భూ సేకరణ సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో ఈ ప్రాజెక్టు ముందుకు కదలలేకపోయింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారుల్లోకి రావడంతో స్మార్ట్ టౌన్ షిప్ పాజెక్టును అమల్లోకి తీసుకురావాలంటూ మధ్యతరగతి ప్రజలు కోరుతున్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21, 22 తేదీల్లో జరిగిన సిపిఎం 24 వ జిల్లా మహాసభలో 11 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నికైందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో చిత్తశుద్ధిగా వ్యవహరించాలన్నారు. పెన్షన్ రూ.1000 పెంచడం అభినందనీయమని, అయితే పెన్షన్లను తొలగించటం ప్రారంభించటాన్ని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని కమిటీలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ప్రజా సమస్య పరిష్కారానికి ప్రజలను కదిలించి ఉద్యమాలు నిర్మించడానికి మహాసభలో ప్రణాళిక రూపొందించామని తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషుబాబ్జి మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఇజడ్ పేరుతో సేకరించిన భూముల్లో పరిశ్రమలు రాలేదు కాబట్టి చట్ట ప్రకారం ఆ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలన్నారు. జిల్లాలో గాడిమొగలో ఉత్పత్తి అవుతున్న గ్యాస్ అంబానీకి విపరీతంగా సంపద పోగు చేస్తుందన్నారు. అయితే ఆ సంపదలో ప్రజలకు వాటా దక్కాలన్నారు. కాబట్టి జిల్లా ప్రజలకు వంటగ్యాస్ ఉచితంగా అందించాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ బెండపూడిలో విమానాశ్రయ నిర్మాణాన్ని రైతులు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో సెజ్ భూముల్లో గాని, గురజానపల్లి సాల్ట్ భూముల్లో గాని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా సబ్ ప్లాన్ గిరిజన గ్రామాల్లో ఐటిడిఎ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కాకినాడ పోర్టు రాజకీయ ప్రయోజనాలకు కేంద్రం కాకుండా ఉపాధి కల్పనకు కేంద్రంగా మారాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.బేబీరాణి, కెఎస్.శ్రీనివాస్, పలివెల వీరబాబు, సిహెచ్.రాజ్‌కుమార్, టేకుమూడి ఈశ్వరరావు, సిహెచ్.రమణి, నీలపాల సూరిబాబు పాల్గొన్నారు.

అమిత్ షా ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

-ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా, ర్యాలీ

ప్రజాశక్తి - తాళ్లరేవు, కాకినాడ

పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక కులగొట్టు సెంటర్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించి రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పిస్తూ దేశానికి అత్యున్నతమైన రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ అంబేద్కర్‌ను పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవమానపరచడం దుర్మార్గమన్నారు. ప్రజల సాధక, బాధలను తీర్చాలని మన భౌతిక పరిస్థితులకు అనుకూలంగా ఒక మహత్తరమైన రాజ్యాంగాన్ని అంబేద్కర్ దేశానికి అందించారని అన్నారు. ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన అంబేద్కర్‌పై ఆర్ఎస్ఎస్, బిజెపి వంటి మతోన్మాదులు ఇటువంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారన్నారు. దేశ ప్రధానికి ఏమాత్రం రాజ్యాంగంపై గౌరవం ఉన్నా తక్షణమే అమిత్ షాను మంత్రిపదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నేరేడుమిల్లి త్రిమూర్తులు, చల్ల సంతోష్‌కుమార్, గోడి భాస్కరరావు, పులపకూర కృష్ణ, నేరేడుమిల్లి దుర్గాప్రసాద్, కుసుమ శ్రీనివాస్, పులపకూర లోవరాజు, వల్లు రాజబాబు, పాలెపు ఈశ్వరరావు, కమిడి ఈశ్వరిబాయి, నామాడి మంగామని, కూరాటి రత్నకుమారి పాల్గొన్నారు. కాకినాడ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ ఛైర్మన్ మోయ్యేటి సూర్యప్రకాష్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై అట్రాసిటీ నమోదు చేసి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న అంబేద్కర్‌వాదులు

తక్షణమే అమిత్ షా దేశ ప్రజలకు అంబేద్కర్ విగ్రహం ముందు మోకరిల్లి క్షమాపణ చెప్పాలన్నారు. రాజ్యాంగ నిర్మాత పట్ల అవహేళనగా మాట్లాడటం ద్వారా దేశద్రోహానికి పాల్పడ్డారని అన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి అధ్యక్షులు తాళ్లూరి రాజు మాట్లాడుతూ అమిత్ షాను పదవి నుంచి బర్తరఫ్ చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎస్‌సి డిపార్ట్‌మెంట్ ప్రధాన కార్యదర్శి కొండా శ్రీను, సిటీ కార్యాలయం ట్రెజరర్ పిట్టా అర్జున్, చీకట్ల అనిల్‌రాజేంద్ర పాల్గొన్నారు.

నగర పంచాయతీలో ఆడిట్ బృందం తనిఖీలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

నగర పంచాయతీ కార్యాలయంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి ఆడిట్ బృందం అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఆడిట్ బృందం తనిఖీల్లో వచ్చిన ఆధారాలను నివేదిక రూపంలో జిల్లా ఆడిట్ అధికారికి నివేదిస్తామని బృందం అధికారులు తెలిపారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న ఆడిట్ బృందం

జీడి పిక్కల కార్మికుల వంటావార్పు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

చిన్నింపేట .జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు సోమవారం ప్రత్తిపాడులో వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్యాక్టరీని తెరిపించాలని కోరుతూ కార్మికులు చేస్తున్న ఉద్యమం 38వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద జరిగని నిరసన కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా యాజమాన్యం పరిశ్రమను మూసి వేయడం అన్యాయమన్నారు. ఫలితంగా 409 మంది కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిశ్రమను తెరిచేలా యాజమాన్యంతో చర్చించాలని, లేనిపక్షంలో ఫ్యాక్టరీని ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి వీరబాబు, చక్రధర్, సిహెచ్.గోవిందు, కె.ధర్మాజీ, బి.ఆది, ఎం.కాంతారావు, రామదుర్గ, జయలక్ష్మి, భాగ్యలక్ష్మి, అన్నపూర్ణ, శివాలక్ష్మి, పాపారత్నం,సత్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంటావార్పుతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున అర్జీదారులు పాల్గొని తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందించారు. కలెక్టర్‌తోపాటు, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్‌ఒ జె.వెంకటరావు, జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, సిపిఒ పి.త్రినాథ్ తదితర అధికారులు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పింఛన్ల, బియ్యం కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు, ఆక్రమణలు తొలిగింపు, డ్రెయిన్లు, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు వంటి అంశాలకు సంబంధించి మొత్తం-434 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన చేసి లబ్ధిదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా పరిష్కరించిన అర్జీల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

హుండీల ద్వారా రూ.28,43,967 ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతిలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కాకినాడ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వి.ఫణీంద్రకుమార్, గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి పిఆర్‌కెఎస్.సాయిప్రసాద్ సమక్షంలో ఆలయ హుండీలను తెరిచి లెక్కింపు జరిపారు. 93 రోజులకు సంబంధించి సాధారణ హుండీలను లెక్కించగా రూ.21,69,272, అన్నదాన హుండీల ఆదాయం రూ.6,74,695 మొత్తం రూ. 28,43,967 ఆదాయం సమకూరిందని ఆలయ కార్య నిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, దేవస్థానం అర్చకులు పెద్దింటి పురుషోత్త మాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, కాండ్రకోట చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది సూర్యప్రకాష్, లావణ్య, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

సత్యనారాయణ చౌదరి కుటుంబానికి జ్యోతుల పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు చావా సత్యనారాయణ చౌదరి కుటుంబాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ పరామర్శించారు. ఇటీవల సత్యనారాయణ చౌదరి తల్లి గంగాభవాని మృతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన సత్యనారాయణ చౌదరి స్వగృహానికి చేరుకుని గంగాభవాని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహనరావు, మురారి గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్, నాయకులు బుర్రి సత్తిబాబు, గద్దె అబ్బన్న, ఒడవల్లి బుల్లిరాజు, అడుసుమిల్లి రాజబాబు, గిరిజాల వెంకన్నదొర పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జ్యోతుల నవీన్

ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కుట్రలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

అరబిందో ఫార్మా కంపెనీ సముద్రంలో వేస్తున్న పైపులైన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న మత్స్యకారులు ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కంపెనీ కుట్రలు సాగిస్తుందని మత్స్యకార నాయకులు ఆరోపించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మత్స్యకార సంఘ నాయకులతోపాటు, ఫార్మా కంపెనీ నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అర్జిలి నాగేశ్వరరావు, నాగరాజు మాట్లాడారు. ఫార్మా కంపెనీ నుంచి తాము డబ్బులు తీసుకోలేదని, అయితే ఎర్రిపల్లి దేవుడు అనే వ్యక్తి ఈ వ్యవహారాన్ని నడిపించారని తెలిపారు. మిగిలిన నలుగురు మత్స్యకారులకు కంపెనీ సొమ్ము ముట్టి ఉండవచ్చుననే అనుమానాన్ని వ్యక్తం చేశారు. మత్స్యకారుల మధ్య విభేదాలు తలెత్తడంతో ఉద్యమం నీరు కారుతోందని, అరబిందో ఫార్మా కంపెనీ మత్స్యకార గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. అయితే కొంతమంది మత్స్యకారులను రహస్యంగా పిలిపించి డబ్బులు ఆశ చూపుతూ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కుట్రలు సాగించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో మత్స్యకార నాయకులు, పెద్దలు పాల్గొన్నారు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరావు

వివేకానంద పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక వివేకానంద పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ నాయుడు వెంకటేశ్వరరావు, డిఎస్‌పి శ్రీహరిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల కష్టాలపై విద్యార్థుల ప్రదర్శన అభినందనీయమని అన్నారు. రైతులు దేశానికి వెన్నుముక లాంటి వారని, అటువంటి రైతు కష్టాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠశాలలో రైతు దినోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 174 రకాల వ్యవసాయ ఉత్పత్తులు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ బిఎఎస్.సరోజిని, ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, సిఐ ఎ.కృష్ణభగవాన్, పాఠశాల హెచ్ఎం వికాశ్, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, నాయకులు నిమ్మకాయల కిరణ్, కంటే జగదీష్, బలుసు వాసు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న డివైఇఒ వెంకటేశ్వరరావు

కరాటేలో 'వినాయక' విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి - కాజులూరు

కరాటే పోటీల్లో వినాయక పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటుకున్నారని పాఠశాల కరస్పాండెంట్ తిరగాటి కిషోర్ తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశ:లో ఆయన మాట్లాడారు. కాకినాడ రూరల్ ఇంద్రపాలెంలో 3వ ఇన్విటేషనల్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్ , ఐదుగురు విద్యార్థులు సిల్వర్ మెడల్, నలుగురు విద్యార్థులు కాంశ్య పథకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలతోపాటు, శిక్షకుడు ఎం.శేఖర్‌లను ఎంఇఒ డేవిడ్‌జాన్, ఎంపిడిఒ రాంబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

పతకాలతో విద్యార్థులు

కార్టూ'నిజం'



నూతన వధువులకు పెళ్లి కానుక అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక టిడిపి కార్యాలయంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు నూతన వధువులకు రూ.20 వేలు చొప్పున పెళ్లి కానుకను ఫౌండేషన్ నిర్వాహకులు, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ అందజేశారు. సోమవారం నియోజకవర్గంలోని కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన తారు వీరలక్ష్మికి, అలాగే గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన నట్టే నాగలక్ష్మికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెళ్లి కానుకను అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెళ్లి చేసుకునే వధువుకు రూ.20 వేలు పెళ్లికానుకను ఇస్తామని హామీ ఇచ్చామని, ఆ హామీని తూచా తప్పక అమలు చేస్తున్నట్లు చెప్పారు. దీనికోసం 9 రోజులు ముందుగా ఫౌండేషన్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, తోట నవీన్, మారిశెట్టి భద్రం, జీనుమణి బాబు, జాస్తి వసంత్, బుర్రి సత్తి బాబు, దిడ్డి శ్రీను, గంగిరెడ్ల దొరబాబు, జట్ల వీరబాబు, మంచి కంటి శ్రీను, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన వధువుకు చెక్కును అందిస్తున్న నవీన్

ఎంపిడిఒగా ట్రైనీ కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలానికి స్వతంత్ర ఎంపిడిఒగా ట్రైనీ కలెక్టర్ భావన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో శిక్షణలో భాగంగా ఈ బాధ్యతలను చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే మండలవ్యాప్తంగా పర్యటించి ఆయా గ్రామాల్లో నెలకున్న సమస్యలను తెలుసుకుంటానని అన్నారు. శిక్షణలో భాగంగా ఎంపిడిఒ స్వప్న తనకు గైడెన్స్ ఇస్తారని అన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

విపత్తుల నిర్వహణపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - తాళ్ళరేవు

ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు శిక్షణా కార్యక్రమం ఎన్‌డిఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జరిగింది. సోమవారం చొల్లంగి జడ్‌పి హైస్కూల్లో జరిగిన సదస్సులో ఎన్‌డిఆర్ఎఫ్ డిఎస్‌పి ఎస్.మన్మథరావు, ఆర్ఎస్ఐ బి.శివకుమార్, ఇన్‌స్పెక్టర్ వి.రాము విద్యార్థులకు పలు ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. వంట గదిలో గ్యాస్ వల్ల సంభవించే ప్రమాదాల నివారణ పై మహిళలకు అగ్నిమాపక శాఖ ఎడిఎఫ్ఒ ఇన్‌ఛార్జ్ పి.కృష్ణదొర, ఆపరేటర్ వివివి.సత్యనారాయణ, ఎల్ఎఫ్ పి.సతీష్, ఫైర్‌మేన్ బి.లక్ష్మణరావు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి.వీరబాబు, విఆర్ఒ కె.శ్రీనివాసరావు, ఆరోగ్యశాఖ ఎపిడమిక్ ఆఫీసర్ డాక్టర్ రవికుమార్, గాడిమొగ పిహెచ్‌సి వైద్యులు ఈశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని అల్లిపూడి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపల్ జి.రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో నాటకాన్ని ప్రదర్శించిన చిన్నారులు

నేరాలు ఘోరాలు

గంజాయి విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బాదితిపోయిన గణేష్ గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో గోదావరి ఏటిగట్టు వద్ద సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి 470 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చందుర్తి గ్రామంలో పుష్కర కాలువ గట్టు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్‌ను ఆదివారం రాత్రి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీతంపేటకు చెందిన ట్రాక్టర్‌గా అధికారులు గుర్తించారు. ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. గనుల శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీరమణి

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

వినియోగదారుల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆర్‌డిఒ కె.శ్రీరమణి సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో వినియోగదారుల చట్టాలపై జరిగిన అవగాహన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వినియోగదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు బళ్లమూడి సూర్యనారాయణమూర్తి వినియోగదారుల చట్టం - 2019 పై అవగాహన కల్పించారు. జిల్లా కన్జ్యూమర్ కమిషన్ సభ్యులు చెక్కా శశి మాట్లాడుతూ తినుబండారాలు, పానీయాలలో తేడా ఉన్నట్టు గమనిస్తే ప్రశ్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిబిసి సభ్యులు ఎం.భాస్కరరావు, టి.సత్యనారాయణ, బమ్మిడి శివమూర్తి పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - జగ్గంపేట

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. జగ్గంపేటలో ప్రతీ సోమవారం దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మండలంలోని జె.కొత్తూరు గ్రామానికి చెందిన దాతల సహకారంతో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ పాల్గొని మాట్లాడారు. దాతల సహకారంతో ప్రతీ సోమవారం అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, వేములకొండ జోగారావు, అడపా మైనర్, అడపా తాతాజీ, నకిరెడ్డి శివ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన

ప్రజాశక్తి - రావులపాలెం

నియోజకవర్గంలో రోడ్డు మరమ్మత్తు పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండల పరిధిలోని ముమ్మిడివరప్పాడు జాతీయ రహదారి నుంచి వెళ్లే రోడ్డు మరమ్మతు పనులను సోమవారం ఎంఎల్‌ఎ బండారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సంక్రాంతి పండగ నాటికి గుంతలు లేని రోడ్లు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టిన రోడ్డు మరమత్తుల పనులన్నీ పూర్తి చేసి సౌకర్యవంతమైన ప్రయాణాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఎంఎల్‌ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాసు, రోడ్లు భవనాలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

సిద్ధార్థలో రామానుజన్ జయంతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రంలోని శ్రీసిద్ధార్థ పాఠశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకల్లో భాగంగా డైరెక్టర్ కె.ముల్లారావు ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణిత శాస్త్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచి గణితంపై అభిరుచి అలవాటు చేసుకుని నిష్ణాతులు కావాలన్నారు. అనంతరం గణిత శాస్త్ర ఎగ్జిబిషన్ డైరెక్టర్ మల్లారావు ప్రారంభించారు.

పాఠశాలల్లో నిబంధనలు, సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జిల్లాలోని ప్రైవేటు యాజమాన్య పాఠశాలలన్ని ప్రభుత్వ నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు తరగతుల నిర్వహణలో ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యాజమాన్య పాఠశాలలు అకడమిక్ క్యాలండర్ ప్రకారం విధిగా సమయ పాలన పాటించాలని తెలిపారు. కేవలం పదో తరగతి విద్యార్థులకు మాత్రమే ప్రత్యేక తరగతులు నిర్వహించుకునే వెసులుబాటు ఉందన్నారు. టైమ్ టేబుల్ ప్రకారం విద్యార్థులకు స్వల్ప విరామ సమయాలు, మధ్యాహ్న భోజనం సమయాలు ఖచ్చితంగా అమలు చేయాలని, విరామ సమయంలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు, టాయిలెట్ సదుపాయాలు తప్పక కల్పించాలని, టైమ్ టేబుల్ ప్రకారం ఆట సమయాన్ని ఇవ్వాలన్నారు.

హామీల అమలు కోసం పోరాటం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీల అమలు కోసం క్షేత్ర స్థాయిలో పోరాటం సాగిస్తామని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. సోమవారం మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన మంతెన అచ్యుత రామరాజు కుటుంబాన్ని ప్రత్తిపాడులో పరామర్శించారు. ఇటీవల కాలంలో అచ్యుత రామరాజు భార్య మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయనకు కుటుంబంతో ఉన్న అనుబంధంతో ఎంపి బోస్ ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక కూటమి పార్టీలు విస్మరించాయని అన్నారు. విద్యుత్ ఛార్జీలను పెద్దఎత్తున ప్రజలపై వేసిందన్నారు. నిత్యవసర సరుకుల ధరలు తగ్గించడంలో ప్రభుత్వం విఫలం అయిందని విమర్శించారు. రైతులను ఆదుకుంటామని పెద్ద ఎత్తున ప్రచారం చేయడం తప్ప ఆచరణలో చేసిందేమి లేదని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజాక్షేత్రంలో పోరాటం చేయడానికి వైసిపి అధినేత జగన్ ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, బెహరా దొరబాబు, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, మాగపు శివ పాల్గొన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న ఎంపి బోస్

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రభుత్వ ఆసుపత్రిలో వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. సోమవరం ప్రత్తిపాడు సిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సభ్యులు వెలుగుల కొండలరావు, బొల్లు వెంకటేశ్వర రావులతో ఎంఎల్‌ఎ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. దూరపు ప్రాంతాల నుంచి వస్తున్న రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ మైకేల్ సౌమ్య, టిడిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, యాళ్ళ జగదీష్, మాజీ సర్పంచ్ యాళ్ళ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ సత్యప్రభ

పూడిక తీత పనులను పరిశీలించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక నెంబర్-2 మార్కెట్ వద్ద జరుగుతున్న మేజర్ డ్రెయినేజీ పూడిక తీత పనులను ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప సోమవారం పరిశీలించారు. తొలుత మున్సిపాలిటీకీ వచ్చిన ఎస్‌సి, ఎస్‌టి నిధుల వినియోగానికి సంబంధించి ఆయా వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై నాయకులతో చర్చించారు. పనుల అంచనాలపై ప్రతిపాదనలు రూపొందించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, నాయకులు కంటే జగదీశ్, బలుసు వాసు, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, నిమ్మకాయల కిరణ్, కాళ్ళ రవీంద్ర, తాతపూడి కృష్ణబాబు, అండుగుల జార్జి చక్రవర్తి, కాపవరపు కుమార్, గొల్లపల్లి కామరాజు, దాట్ల శ్రీనివాసరావు, మెండుం సత్రయ్య, గోల్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి విద్యార్థి సాంకేతికతను అంది పుచ్చుకోవాలని రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కెవివి..సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ హైస్కూల్లో జాతీయ గణిత దినోత్సవ ముగింపు కార్యక్రమం గణిత వధాని, హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి మేధస్సు చాలా విలువైనదని, ఏకాగ్రత, క్రమ శిక్షణతో ప్రతి ఒక్కరూ తమ మేధస్సును ఉపయోగించడం వల్ల అద్భుతాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన గణిత నృత్యాలు, గణిత పాటలు, ఏకపాత్రాభినయాలతో అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు మెమోంటోలను అందించారు. అనంతరం డాక్టర్ కెవివి. సత్యనారాయణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి మెమోంటో అందిస్తున్న సత్యనారాయణ

భౌతిక శాస్త్ర ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో సోమవారం వీర్రాజు హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులకు భౌతిక శాస్త్రం ప్రయోగాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ప్రయోగాలలో వైశాల్యం యొక్క ప్రభావం, వివిధ రకాల విద్యుత్ మీటర్ల రీడింగు వంటి అనేక ప్రయోగాలు చేయించారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

పలు అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెం, చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ పెయ్యల మంగేష్ సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సిసి డ్రెయిన్, సిసి రోడ్లు, పాంచాలరేవు నిర్మాణం చేపట్టనున్నట్లు పంచాయతీ కార్యదర్శి విజెవి.రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీనరసింహరాజు, టిడిపి నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, స్థానిక వార్డు సభ్యురాలు బర్రె కాటవేణి, కృష్ణవేణి, గ్రామ పెద్దలు కొపనాతి నాగరాజు, రేకాడి వెంకటేశ్వర్లు, సంగాడి శ్రీను పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న సర్పంచ్

బ్యాంకుల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట వివిధ బ్యాంకుల వద్ద ఉన్న భద్రతా ఏర్పాట్లను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. యూనియన్, యాక్సిస్, ఎస్‌బిఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డిఎఫ్‌సి, సిబిఎస్, కెనరా, తదితరుల బ్యాంకులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్లను, సిబ్బందిని, సెక్యూరిటీ సిబ్బందితో బ్యాంకు యొక్క భద్రతా విధానాలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులలో ఉన్న సిసి కెమెరా మోనిటరింగ్ సిస్టం ను పర్యవేక్షించి రోడ్డు భాగం కూడా కవర్ అయ్యేలా కెమెరాను సరి చేయాలని ఆదేశించారు. సెక్యూరిటి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఏర్పాట్లును పరిశీలిస్తున్న సిఐ

పల్లె పండుగ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఉప్పంపాలెం గ్రామంలో పల్లె పండుగ అభివృద్ధి పనులను స్థానిక టిడిపి నాయకులు ఎనుముల జగదీష్, నాగం రాము సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగానే ఉపాధి హామీ నిధులతో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు.

పల్లె పండుగ పనుల పరిశీలన

పనుల వివరాలను తెలుసుకుంటున్న ఎంపిడిఒ శ్రీలలిత

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని గోరింట, తిరుపతి, వడ్లమూరు, చదలాడ, దివిలి, జి.రాగంపేట గ్రామాల్లో చేపట్టిన పల్లె పండుగ పనులను ఎంపిడిఒ శ్రీ లలిత సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి నాటికి ఈ పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. చదలాడ గ్రామంలో కిచెన్ గార్డెన్ నిర్వహణను పంచాయతీ కార్యదర్శి బి.ఈశ్వరరావు, సచివాలయ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సుధీర్, జెఇ సతీష్, మండల ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శ్రీరమణి

అర్జీలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం, గండేపల్లి

పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో 8 మంది అర్జీలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీరమణి అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఆయా సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఎఒ మాధవరావు, డిటి భానుకుమార్, డివైఇఒ ఇ.ప్రభాకరశర్మ, రవిశంకర్, రాజు పాల్గొన్నారు. గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో రెండు అర్జీలు వచ్చాయి. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.శ్రీనివాసు, పరిపాలన అధికారి కె.చంద్రరావు, ఎంఇఒ నాయక్, వ్యవసాయ అధికారి ఎ.సద్గురుమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బియ్యం, నగదును అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

గిరిజన కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని ధర్మవరం శివారు గిరిజన తండా దోపతి గ్రామానికి చెందిన ఒక కుటుంబానికి ఎంఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, కొంత నగదు సాయం అందజేశారు. సోమవారం గ్రామంలో పర్యటించిన ట్రస్ట్ ఛైర్మన్, వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు గ్రామానికి చెందిన గొట్టిపల్లి నూకరాజు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బౌరువాక సర్పంచ్ సత్యనారాయణ, కె.తాతబాబు, బి.నాగేశ్వరరావు, ఎం.శివ పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - శంఖవరం

శంఖవరంలోని విలేజ్ హెల్త్ క్లినిక్-2లో జిల్లా గణాంక అధికారి బి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పరీక్షలు చేసి తీసుకోవలసిన ఆహారం అలవాట్లు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా వైద్యాధికారి జి.మహేష్ క్లినిక్‌కు సంబంధించిన రికార్డ్స్ ఆన్‌లైన్ డేటా ఎంట్రీని పరిశీలించారు. అలాగే పిహెచ్‌సి పరిధిలోని సిబ్బందికి ఆరోగ్య కార్యక్రమాలు, డేటా ఎంట్రీ రిపోర్ట్స్‌లపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు మహేష్, షర్మిల, పిహెచ్‌సి వైద్యులు శెట్టిబత్తుల శ్రీరామ్ రాజీవ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పడిపోయినవి

చింతపల్లి వెంకటరమణS/o.సత్యన్నారాయణ అను నేను ది.20-12-2024 సం॥తేదీన పొన్నాడ నుండి నాగులాపల్లి జిరాక్స్ నిమిత్తం వెళుతుండగా దారి మార్గంలో **ది.25-03-2024** సం॥ తేదిన చింతపల్లి నూకిరెడ్డి గారు నా పేరున పిఠాపురం స॥రి॥వారి ఆఫీసు నందు డాక్యుమెంట్ **నెం.522/2004** గా రిజిష్టీ కాబడిన ఒరిజినల్ గిఫ్ట్ డీడ్ పడిపోయినది. ఎంత వెతికినను కనిపించలేదు. కావున ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవరికైన దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు అందజేసిన ఎడల తగు బహుమతి ఇవ్వబడును.

చింతపల్లి వెంకటరమణ
సెల్ : 9866182966

పాస్‌పోర్టు పోయినది

డా॥ B.R.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం, చింతనలంక గ్రామం, D.No. 3-176, మసీద్‌సెంటర్‌కి చెందిన షేక్ సుభాన్ S/o బాబ్జీ షేక్ అను నా యొక్క No. R5900619 నెంబరు గల ఒరిజినల్ పాస్‌పోర్టు ఇంటి దగ్గర నుండి జిరాక్స్ నిమిత్తం ముక్తేశ్వరం సెంటర్‌కి వెళ్లి వస్తుండగా పడిపోయినది. దొరికినవారు ఈ సెల్ నెంబర్‌కు తెలియజేయగలరు.

Cell: 80741 17303.

మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.8/2018

Between:-
శ్యామల మురళి మరియు 1 వగైరాలు ...వాదులు
మరియు
జంపన అనిత మరియు 2 వగైరాలు ...ప్రతివాదులు

To.
2వ ప్రతివాది: సబ్బెళ్ల రత్నారెడ్డిS/o.సత్తిరెడ్డి, హిందూ, 34సం॥లు. డోర్‌నెం. 24-28/4-14, గణపతిరావు వీధి, గాంధీనగరం, దుర్గాపురం, విజయవాడ అర్బన్, కృష్ణజిల్లా.

పై నెంబరు దావా గ్రంథంలో 2వ ప్రతివాది అయిన మీకు మహారాజశ్రీ పై కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మహారాజశ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం పైన తెలిపిన దావా **ది.06-01-2025** వ సం॥కు వాయిదా వేసియున్నారు. కావున సదరు తేదీన ఉదయం గం॥ **10.30** ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించడముతుందని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వేమూరి వి.ఆర్.సుబ్రమణ్యం
వాది తరపు అడ్వకేట్
అనపర్తి, తూర్పుగోదావరి జిల్లా
సెల్ : 9912946959

మహారాజశ్రీ పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.A.37/2024 in E.P.54/2023 in O.S.161/2021

Between:
వాసంశెట్టి బాబూరావు ...D.H.R/Platintiff
మరియు
వాసంశెట్టి మహాలక్ష్మి & తాతరావు మరియు ఇతరులు ...JDR.S/Defendants

To
JDRNO.1:-వాసంశెట్టి మహాలక్ష్మి & తాతరావు S/o.అప్పారావు, 55 సం॥లు, వ్యయసాయం, నక్కుళ్ళమ్మ గుడి వీధి, నవకండ్రవాడ, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా.

JDRNO.2:-వాసంశెట్టి సూరిబాబు S/o. అప్పారావు, 45సం॥లు, వ్యవసాయం, భారతి మెస్ వారి వీధి, గ్రామసచివాలయం నెం.1, దుర్గమ్మ గుడి, వలసపాకలు జంక్షన్, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు EA.లో 1వ మరియు 2వ JDR లు అయిన వాసంశెట్టి మహాలక్ష్మి & తాతరావు మరియు వాసంశెట్టి సూరిబాబు అనే మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సదరు **E.A.37/2024** లో ఎన్నిసార్లు నోటీసులు పంపించిన సదరు నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు ఉత్తర్వులు ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా మీరు **ది.07-01-2025** వ తేదీన ఉదయం **10.30** గం॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపనలు ఏమైనా ఉన్నచో తెలియజేసుకొనవలసినదిగా ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది. మీరు అలా హాజరు కానిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయుచున్నాను.

//By Order of the Hon'ble Prl.Junior Civil Judge Court Pithapuram//
G.Surya Prakash Rao
Advocate, Pithapuram
Cell.7013442337,9440584483

ఆక్రమణల తొలగింపులో అలసత్వం

- కోర్టు ఆదేశాలు ఉల్లంఘిస్తున్నారంటూ ఫిర్యాదు

ప్రజాశక్తి - కాకినాడ, ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల మీద అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ బాధితులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే పలుమార్లు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. పంచాయతీ స్థలంలో నిర్మాణాలు తొలగించాల్సిందేనని ఎపి హైకోర్టు ఉత్తర్వులున్నప్పటికీ పంచాయతీ అధికారులు స్పందించడం లేదంటూ గ్రామానికి చెందిన గొర్ల వెంకటరత్నం మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే కోర్టు ఆదేశాలు ధిక్కరించినందుకు మరోసారి హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ధర్మవరం గ్రామంలో వైసిపి ప్రభుత్వంలో సొసైటీ పాలకమండలిలో సభ్యుడిగా ఉన్న వ్యక్తి పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన అంశం మీద ఎంఎల్‌ఎ, ఆర్‌డిఒ సహా పలువురు ఆదేశాలు ఇచ్చినప్పటికీ పంచాయతీ సిబ్బంది స్పందించడం లేదన్నారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే కోర్టులో కేసు వేస్తామని తెలిపారు.

అన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వర స్వామి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు యాళ్ల వెంకట సత్యసాయి నవీన్ పేరుతో లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు. సోమవారం దాత తల్లిదండ్రులు వైవిపిఎస్.ప్రసాద్ దంపతులు ఆలయానికి విచ్చేసి రూ. లక్ష విరాళాన్ని ఆలయ కార్య నిర్వహణ అధికారి బల్ల నీలకంఠంకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి రసీదును, ప్రత్యేక ప్రసాదాన్ని అందజేశారు.

25న మానవ హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 25న తాళ్లరేవులో జరుపనున్న మానవ హక్కుల పరిరక్షణ దినోత్సవం విజయవంతం చేయాలని ప్రజా సంఘాల ప్రతినిధి ఎలిపే నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. మనుస్మృతి దహన దినాన్ని మానవ హక్కుల పోరాట దినోత్సవంగా పాటిద్దామని తెలిపారు. అంబేద్కర్ భవన్ వద్ద 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

గోవిందరాజులు కుటుంబానికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

ఇటీవల మృతి చెందిన ఉప్పలపాడు సొసైటీ మాజీ అధ్యక్షులు మేడిబోయిన గోవిందరాజులు కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. ఆయన కుమారులు మేడిబోయిన శ్రీను, శివరామకృష్ణ, గంగాధర్, సూర్యచంద్ర ఓదార్చారు. తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో ఎంపిపి చలగళ్ళ దొరబాబు, ఎంపిటిసి సభ్యులు మద్దిపట్ల రామకృష్ణ, నాయకులు గుల్లపూడి నాని, పెమ్మనబోయిన వరప్రసాద్, సాయి బాబా ఉన్నారు.

అన్నవరం ట్రస్ట్ బోర్డ్ మాజీ మెంబర్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - కరప

అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్ చాగంటి సూరిబాబుకు మాతవియోగం కలిగింది. చాగంటి ప్రభావతి (78) ఉపాధ్యాయురాలిగా సేవలందించి రిటైర్ అయ్యారు. ఆమెకు భర్త గోపాలకృష్ణ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె పార్థివదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో గొర్రెల వెంకన్న, పెదబాబు, అనిశెట్టి ప్రసాద్, పోలిశెట్టి తాతీలు, బుద్దాల చక్రరావు, కాకర బుజ్జి బాబు, మేడిశెట్టి నాయుడు, సలాది వెంకన్నబాబు తదితరులు ఉన్నారు.

కొడవలిలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

గొల్లప్రోలు మండలంలోని కొడవలి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కెవివి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటి సౌమ్య, మండల సర్వేరు కేదారేశ్వరరావు, విఆర్‌ఒ గోవిందరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - రౌతులపూడి, జగ్గంపేట

రౌతులపూడిలో పలు పాఠశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సెయింట్ థామస్ పాఠశాలలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిఆర్ గ్రీన్ వుడ్ పాఠశాలలోను క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. జగ్గంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఐసిడిఎస్ సిడిపిఒ పూర్ణిమ ఆధ్వర్యంలో మండలంలోని ఇర్రిపాక గ్రామంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రొవ్వొత్తులు వెలిగించి పిల్లలతో హ్యాపీ క్రిస్మస్ మేరీ క్రిస్మస్ అంటూ కేకు కట్ చేసి కేకు కట్ చేసి పిల్లలకు, తల్లులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజపూడి సెక్టార్ సూపర్‌వైజర్ అమ్మాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు మంగతాయారు, భూషణం, హెల్పర్ అచ్చుత తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు తూర్పుగోదావరిజిల్లా, రాజమహేంద్రవరం, గాధాలమ్మ నగర్, డోర్‌నెం.88-3-5రు కాపురస్తులు (లేటు) చింతలపాటి సన్యాసిరాజు గారి కుమారుడు చింతలపాటి వి.ఎస్.ఎస్.ఆర్.ఆర్.రాజు గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

నా క్లయింటు తన స్వాధీనంలోగల ఈదిగువ ఉదహరించిన దస్తావేజులు తన దగ్గర ఉద్యోగం చేస్తున్న గొట్టుముక్కల సురేష్‌కుమార్ రాజు గారికి ఇచ్చి జిరాక్సుకాపీలు తీయించమని అప్పగించగా, అవి పెద్దాపురం మెయిన్‌రోడ్డులో గల జిరాక్సు షాపులో జిరాక్సు కాపీలు తీసుకొని వస్తుండగా ఒరిజినల్ దాస్తావేజులు పడిపోయినవి. సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికినయెడల నాకు గాని, నా క్లయింటుకు గాని అప్పగించ వలసినదిగా కోరుచున్నాను.

దస్తావేజులు వివరములు:-

1. ది.25-3-2013తేదీన రాజమండ్రి కాపురస్తులు జాస్తి సుబ్బారావు వగైరాలు రాజమండ్రి గాధాలమ్మనగర్ కాపురస్తులు (లేటు) చింతలపాటి రామరాజు గారి కుమారుడు చింతలపాటి సన్యాసిరాజు గారికి రాజమండ్రి మున్సిపల్ ఏరియాలో చేరిన పిడింగొయ్యి గ్రామం, డోర్.నెం.3-32రుకు చేర్చిన ప్లాటు నెం.50కు సంబంధించిన క్రియదస్తావేజు ద.నెం.**1872/2013.**

2. ది.27-10-2004తేదీన రాజమండ్రి కాపురస్తులు పేరిచర్ల శివరామరాజు గారి భార్య **పేరిచర్ల వెంకటరమణి** గార్కి భీమవరం గ్రామకాపురస్తులు గెడ సాయిపద్మిని గారు రాజమండ్రి గాధాలమ్మనగర్ డోర్.నెం.89-5-3రుకు చేర్చిన 12, 13 ప్లాట్లుకు సంబంధించిన క్రియదస్తావేజు ద.నెం.**7663/2004.**

3. ది.02-11-2018తేదీన విశాఖపట్నం గ్రామకాపురస్తురాలు పేరిచర్ల శివరామరాజు గారి భార్య **పేరిచర్ల వెంకటరమణి** గారు చింతలపాటి సన్యాసిరాజు గారి భార్య చింతలపాటి గిరిజ గారికి రాజమండ్రి కార్పొరేషన్ ఏరియాకు చెందిన రాజమండ్రి గాధాలమ్మనగర్ డోర్.నెం.89-5-3రుకు చేర్చిన 12, 13 ప్లాట్లుకు సంబంధించిన శెటిల్‌మెంటు రిజిష్టర్డు ద.నెం.**6192/2018.**

4. ది.1-12-2011తేదీన పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, దుర్గాపూర్ గ్రామకాపురస్తులు చింతలపాటి వెంకట సత్య సూర్య రఘురామరాజు గారి భార్య చింతలపాటి రాధ గారికి రాజమండ్రి శ్యామలానగర్ కాపురస్తులు బిక్కిన వీరాస్వామి, బిక్కిన ఉషారాణి గార్లు రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా డోర్.నెం.88-3-5రుకు చేర్చిన ఆర్.ఎస్.నెం.365, 366, 367లలో గల 720చ.గ.లు ప్లాటునెంబర్లు 29, 30లకు చెందిన క్రియ దస్తావేజు ద.నెం.**7034/2011.**

5. ది.7-6-2008తేదీన రాజమండ్రి కాపురస్తులు బిక్కిన వీరాస్వామి వగైరాలు చింతలపాటి రామరాజు గారి కుమారుడు చింతలపాటి సన్యాసిరాజు గారికి రాజమండ్రి మున్సిపల్ ఏరియాకు చెందిన డోర్.నెం.89-6-5రుకు సమీపంన గల ఆర్.ఎస్.నెం.367రు చేర్చిన ప్లాటు నెం.16కు సంబంధించిన క్రియదస్తావేజు ద.నెం.**3171/2008.**

6. ది.25-11-11తేదీన రాజమండ్రి కాపురస్తులు బిక్కిన జగదీష్‌బాబు రాజమండ్రి కాపురస్తులు చింతలపాటి రామరాజు గారి కుమారుడు చింతలపాటి సన్యాసిరాజు గారికి రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా గాధాలమ్మ ఏరియాకు చెందిన డోర్.నెం.88-3-5రుకు చేర్చిన ప్లాటు నెం.34, 35, 36లకు సంబంధించిన క్రియదస్తావేజు ద.నెం.**6908/2011.**

7. ది.28-6-2005తేదీన రాజమండ్రి కాపురస్తులు చిట్టూరి చంద్రం గారి కుమార్డు చిట్టూరి వెంకట పూల్లేశ్వరరావు విశాఖపట్నం కాపురస్తురాలు పేరిచర్ల శివరామరాజు గారి భార్య **పేరిచర్ల వెంకటరమణి** గారికి రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా ఆర్.ఎస్.నెం.365, 366, 376లలో గల ప్లాటు నెం.31, 32, 33లకు సంబంధించిన క్రియ దస్తావేజు ద.నెం.**5819/2005.**

8. ది.27-10-2004తేదీన పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం గ్రామకాపురస్తులు గడా సురేష్‌కుమార్ గారి భార్య గడా సాయి పద్మిని శ్రీమతి మరియు శ్రీ చింతలపాటి రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున ఛీఫ్ ట్రస్టీ చింతలపాటి సన్యాసిరాజు గారికి రాజమండ్రి గాధాలమ్మనగర్ సమీప డోర్.నెం.89-5-3రుకు చేర్చిన ప్లాటు నెం.14కు సంబంధించిన క్రియ దస్తావేజు ద.నెం.**7712/2004.**

9. ది.03-01-2019తేదీన చింతలపాటి వి.ఎస్.ఎస్.ఆర్.ఆర్.రాజు గారు **పేరిచర్ల వెంకటరమణి** వగైరాలకు శ్రీనివాసా ఫెర్రో ఎలాయిస్ తరుపున, గిరిజా స్మెల్టర్స్ తరుపున, గాయత్రి మినరల్స్ తరుపున దాస్తవేజులు డిపోజిట్ చేసి తనఖా పెట్టిన దస్తావేజు నెం.**122/2019.**

(వేదుల సుబ్రహ్మణ్యం)
అడ్వకేట్, పెద్దాపురం,
సెల్‌నెం.90526 99989